# మానవత్వం

రకరకాల రంగుల్లో... అందంగా విరబూసి, సుగంధ పరిమళాల్ని విరజిమ్మే పూలని చూసి స్పందించని మనసుండదు!

అదే క్షణాన....

ఆ పూలని కోసి పూరేకుల్ని కసకసా నలిపి, అవతలికి విసిరేసే కసాయి మనిషిని చూస్తూ.... మనసు చివుక్కుమనకుండా ఉండదు !

మొగ్గ తొడిగి, మూడు రోజుల్లో వాడిపోయే పువ్వులాంటి 'జీవితం'... మనిషికి ప్రకృతి ప్రసాదించిన అన్ని వరాల్లోకెల్లా అమూల్యమైంది!

చిన్నముల్లు గుచ్చుకుంటేనే విలవిల్లాడే మనిషి... తోటి మనుషుల కుత్తుకల్ని కోయడానికి ఎలా సిద్ధపడ్తున్నాడన్నదే అత్యంత ఆశ్చర్యకరమైన విషయం!

కులమత ద్వేషాలతోనో, వ్యక్తిగత కక్షలవల్లో, ఆస్తిపాస్తుల కొరకో, తను నమ్మిన 'ఇజం' కోసమో... ఒకర్నొకరు చంపుకోవడం..... హింసించుకోవడం.... పైగా దాన్ని సమర్థించుకోవడం.... ఇలాంటివన్నీ చాలా సహజమైన విషయాలుగా మనమంతా సరిపెట్టుకోవడం... మర్నాటికల్లా మరిచిపోవడం మన సిగ్గులేనితనానికి నిదర్శనం!

అన్నింటికంటే తమాషా.... చంపినవాడు మనవాడైతే కిక్కురు మనకుండా ఉండే మనం... చచ్చినవాడు మన వాడైతే గుండెలు బాదుకోవడం !

పోతే...

కొందరుంటారు... వాళ్ళు పనిగట్టుకుని ఎదుటి వారి గుండెల్లో కత్తులు దించక్కర్లేదు..... మాటల ఈటెల్తో మనసుని తూట్లు పొడిచి.... చిత్రవధ చేస్తారు. ఇలాంటి వాళ్ళు పైకి సాత్వికంగా కన్పిస్తారే గానీ నిజానికి - పచ్చి నెత్తురు తాగే హంతకుల కన్నా ప్రమాదకరమై వాళ్ళు!

అన్ని జీవరాసుల్లోకి ఉత్కృష్టమైన జన్మ ఎత్తినందుకైనా మనిషి తన తోటి మనషుల కష్టసుఖాలకి స్పందించకపోతే - అతడు 'మనిషి తోలు' కప్పుకున్న మృగమవుతాడే తప్ప - మనిషి అన్పించుకోడు !

**మారణ హోమపు పొగలకి - సెగలకి ఉక్కిరి బిక్కిరై ఊపిరాడక - వడలి - వాడిపోతోన్న మానవాళికి - ఒకింత చల్లదనాన్నిచ్చే....**

**వెన్న....**

**వెన్నెలే...**

**మానవత్వం....!**

ఆ వెన్నని వెతికి - తూట్లు పడిన దేహానికో - గాయపడిన హృదయానికో పూసే మనుషులు - జాతికి రథసారధులైతే మనిషి మనసులోని రాక్షసత్వం సిగ్గుతో ఆత్మాహుతి చేసుకుంటుంది. ఎక్కడ చూసినా సర్వ మానవ సౌభ్రాతృత్వం వెల్లి విరుస్తుంది!



16-04-1995